
# పనసపండు ప్రహసనం

-ఎన్.వెంకటేశ్వర్లు



బయటనుంచి ఇంట్లోకి అడుగుపెట్టగానే పనసపండు వాసన గుబాళించింది. నా శ్రీమతిని ఆరాతీస్తే పక్కవీధిలో తనకు తెలిసినవాళ్ళు 16 ఫలాల నోము నోచుకొని మా ఆవిడను పిలిచి ఉద్యాపన ఇచ్చారట. మెట్ల గదిలోకి వెళ్ళి చూస్తే ఒక గుట్టలా పడి వున్నాయి.

"ఎలా తీసుకు వచ్చావు?" అని అడిగితే వాళ్ళాయనే ఒక ఆటోలో తీసుకువచ్చి గదిలో సర్దిపెట్టి వెళ్ళారని చెప్పింది.

"ఈ పళ్ళన్నీ మనమేం చేసుకుంటాం. నిల్వ చేస్తే పాడైపోతాయి కదా?" అన్నాను.

"ఆ భయమేమీ అక్కర్లేదండీ! మా మహిళా సభ్యులలో ఎవ్వరైతే పనసపండు ఇష్టపడతారో వారందరినీ వచ్చి తీసుకెళ్ళమని ఫోను చేశానండి" అని సమాధానం ఇచ్చింది.

"సరే... నాకు ఆకలి దంచేస్తోంది, అన్నం వడ్డించు" అంటుంటే గేటు తెరచుకున్న శబ్దం వినిపించింది. పెద్ద సంచితో సహా ఒక మహిళ వచ్చింది.

"రండి రండంటూ" మా ఆవిడ ఆమెను ఆహ్వానించింది.

వచ్చినావిడ గదిలోకి వెళ్ళి రెండు పనస పళ్లు ఎన్నుకుని సంచిలో వేసుకుంటూ, "మా బంధువులు మా పక్క వీధిలో వున్నారు, వాళ్ళకి ఇస్తాను" అంటూ బయటకు వెళ్ళింది.

ఆ తరువాత ఒక్కొక్కరూ రావటం, ఒకటి రెండు పళ్లు తీసుకెళ్ళటం జరిగింది. ఒక్క గంటలో 12 పళ్లూ తీసుకెళ్లిపోయారు. ఒక పండు మేముంచుకొని మిగిలినవి సాయంత్రాని కల్లా పంచటమైంది.

ఇది జరిగిన కొన్ని సంవత్సరాల తర్వాత ఆలిండియా ఆడిట్ అండ్ ఎకౌంట్స్ వార్షిక మహా సభ తిరువనంతపురం వేదికగా నిర్ణయించారు. తంతి తపాలా ఆడిట్ ఆఫీస్ జనరల్ సెక్రటరీగా మా ఆఫీసు సభ్యులు నన్ను వెళ్ళమన్నారు. నేను, ఏ.జి.ఆఫీసు, రైల్వే, డిఫెన్సు ఆడిట్ డెలిగేట్లందరం మెడ్రాసు ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరాము. ఆ రోజుల్లో నేరుగా త్రివేండ్రం వెళ్ళాలంటే రైలు సౌకర్యం లేదు. మెడ్రాసులో దిగి రైలు మారాలి. మొత్తానికి త్రివేండ్రం చేరుకొని కాన్ఫరెన్సుకు హాజరయి మళ్ళీ తిరుగు ప్రయాణానికి స్టేషనుకు చేరుకున్నాం. ఇంకా టైముంది కదా అని ప్లాట్‌ఫారం మీద అటూ ఇటూ తిరుగుతున్నాం. మా కంపార్టుమెంటు దగ్గర పెద్ద పెద్ద పనసపళ్లు అమ్ముతున్నాడు.

మా స్నేహితుడు బేరమాడి మొత్తానికి ఒకటి తీసుకున్నాడు. ఆ వ్యాపారే ఒక కుర్రవాడి చేత పనసపండును రైలులో పెట్టించాడు. పండు సుమారు ఏడెనిమిది కేజీలు బరువుంటుంది.

"ఎందుకురా కొన్నావు. తీసుకెళ్ళటం కష్టం కదా" అని అన్నాను.

"ఏం ఫరవాలేదు. ఇదే పండు హైదరాబాదులో అయితే చాలా ఖరీదు వుంటుంది" అన్నాడు.

మర్నాడు మద్రాసులో రైలు దిగాం. పనస పండు కిందకి దించేందుకు నేను సాయపడ్డాను.

"అవునూ! ఇందాక వాడు ఏదో అరవంలో సణుక్కుంటున్నాడు. దేనిగురించి?" అని అడిగాడు నా స్నేహితుడు.

"ఏం లేదు. ఆంధ్రాలో పనసపళ్లు బాగా దొరుకుతాయి కదా? ఈ వెర్రిబాగులవాడు కేరళ నుంచి తీసుకెళ్తున్నాడేంటీ అని అంటున్నాడు" నేను చెప్పాను.

మొత్తానికి హైదరాబాదు చేరుకున్నాము. ప్లాట్‌ఫారమ్ మీద మళ్ళీ కూలితో ఇదే బాధ. అక్కడినుంచి హైదరాబాదు వెళ్ళే రైలు పక్కప్లాట్‌ఫాం మీదకు వస్తుంది.

కూలీ వచ్చి తమిళంలో "ఏ ట్రెయినుకు వెళ్ళాలి?" అని అడిగాడు.

చెప్పంగానే ఒక రెండు నిముషాలు ఆగి "పత్తు రూపాయి కుడుంగో" అన్నాడు.

నేను తర్జుమా చేసి "పది రూపాయలు ఇవ్వండి. చాలా బరువు. దూరం నడవాలి కదా" అని చెప్పాను.

వేరే దారి లేక పది రూపాయలకు ఒప్పుకున్నాడు. రెండు సంచులు రెండు భుజాలకు తగిలించుకొని, పనసపండు నెత్తిమీద పెట్టుకుని ఏదో గొణుక్కుంటూ వచ్చి మా ప్లాట్‌ఫారం మీద సామాను దింపి పది రూపాయలు తీసుకొని వెళ్ళిపోయాడు.

మొత్తానికి బయటికి ఆటోస్టాండు దగ్గర దింపి నేను బస్సుస్టాండుకు చేరుకుని మా కాలనీకి వెళ్ళే బస్సు ఎక్కి ఇంటికి చేరుకున్నాను.

నెలరోజుల తరువాత అతన్ని కలుసుకోవటం జరిగింది. పిచ్చాపాటి మాట్లాడుతున్నప్పుడు అడిగాను.

"పనసపండు బాగా రుచిగా వుందా?" అని.

"ఏం బాగులే! మోత కూలీ బాగా వదిలింది. ఎందుకండీ ఇంత ఖర్చుపెట్టి తెచ్చారు. మన హైదరాబాదులో సగం ధరకే దొరుకుతాయి కదా? ఏదో సామెత చెప్పినట్లు కాశీకెళ్ళి కొబ్బరికాయ తెచ్చినట్లుంది" అంటూ నామీదే జోకులేసింది నా భార్య" అంటూ నా మిత్రుడు మొహం చిన్నబుచ్చుకున్నాడు.

★